సాక్షి వైఎస్ఆర్ జిల్లా

శనివారం : 6 : ఏప్రిల్ : 2024



వెయ్యి నెలల పుణ్య ఫలం బడీరాత్

లైలతుల్ ఖదర్.. వెయ్యి నెలలకు పైగా పుణ్య ఫలం లభించే రేయి. దీనిని ముస్లింలు 'బడీరాత్' (పెద్దరాత్రి) అని కూడా అంటారు.

-IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సహార్ ఆది (ఉ॥)
కడప	: 6.31	4.52
పులివెందుల	: 6.34	4.47
ప్రొద్దుటూరు	: 6.33	4.56

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 42.8/21.8

జిల్లాలో శుక్రవారం 21.8 – 42.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్‌రామ్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: దేశ స్వాతంత్య్రం కోసం పోరాడుతూనే, మరోవైపు సామాజిక వివక్షను జయించిన సామాజిక విప్లవ యోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని, ఆయనకు దేశం యావత్తు మమతల నీరాజనాలు అర్పిస్తోందని కలెక్టర్ వి.విజయరామరాజు కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఆనాడు ఆయన కష్టపడి చదవడం వల్లనే ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొంది అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం, వివక్షను నిర్మూలించడంలో ఆయన చేసిన కృషికి గుర్తుగా ఆయన జన్మదినాన్ని భారత ప్రభుత్వం 'సమతా దివస్' గా పరిగణిస్తోందన్నారు. తొలుత ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతితోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాచిగూడకు ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: కాచిగూడ–తిరుపతి–కాచిగూడ (07653/07654) మధ్య కడప మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నారని కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌లు తెలిపారు. ఈనెల 11, 18, 25, మే 1 తేదీల్లో కాచిగూడ నుంచి తిరుపతికి, ఏప్రిల్ 12, 19, 26, మే 2వ తేదీల్లో తిరుపతి నుంచి కాచిగూడకు ఈ ప్రత్యేక రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. ఈ రైలు ప్రతి గురువారం రాత్రి 10.30 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.05 గంటలకు కడప మీదుగా తిరుపతికి చేరుతుందన్నారు. ప్రతి శుక్రవారం తిరుపతిలో రాత్రి 8.05 గంటలకు బయలుదేరి కడపకు 10.25 గంటలకు చేరుకుని మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు కాచిగూడకు చేరుతుందన్నారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు కడపలో షర్మిల ప్రచారం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరంలోని పలు ప్రాంతాల్లో పీసీసీ అధ్యక్షురాలు, కడప కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి షర్మిల శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. షర్మిల ఉదయం 9.30 గంటలకు పెద్ద దర్గాలో ప్రార్థనలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని తెలిపారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

కడప రూరల్: ఒక వైపు మండు టెండలు.. మరో వైపు పింఛన్ కోసం సచివాలయానికి పండుటాకుల అడుగులు. పింఛన్ల పంపిణీ చివరి దశకు చేరుకుంది. అయితే వృద్ధులు, వయసు పైబడిన వారికి అవస్థలు మాత్రం తప్పలేదు. వలంటీర్లను విధులకు దూరంగా ఉంచడంతో సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీని చురుగ్గా చేపట్టారు. వలంటీర్‌లు ఇంటింటికీ వచ్చి పింఛన్లను పంపిణీ చేసి ఉంటే తమకెంతో సౌకర్యంగా ఉండేదని అవ్వాతాతలు అభిప్రాయ పడ్డారు. 'ఏం తపని చేశావు.. చంద్రబాబూ, నీవల్లే మాకీ కష్టాలు' దాపురించాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా మొత్తం 2,68,182 పింఛన్లకు మొత్తం రూ.79,31,35,000 పంపిణీ చేయాలి. అందులో భాగంగా మూడవ రోజైన శుక్రవారం సాయంత్రానికి 2,50,558 పింఛన్లకు రూ 75,55,20,500 పంపిణీ చేశారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



కేంద్ర సాయుధ బలగాలతో 'ఫ్లాగ్ మార్చ్' చేస్తున్న పోలీసులు

కడప అర్బన్: జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కడప రిమ్స్ పీఎస్ సీఐ కె.రామచంద్ర ఆధ్వర్యంలో ఎస్ఐలు ఎర్రన్న, ఏఎస్ఐ యోగా రాయల్, సిబ్బంది 'సశస్త్ర సీమా బల్' (ఎస్.ఎస్.బి) బలగాలతో కవాతు నిర్వహించారు. ఆర్‌కె నగర్, తిలక్‌నగర్, చలమారెడ్డిపల్లె, బీడీ కాలనీ ప్రాంతాల మీదుగా ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు సంకల్పించారు. ప్రజల్లో వున్న భయాందోళనను పోగొట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్టీసీకి అండ



కడప ఆర్టీసీ డిపోలో బస్సులు

- ఇచ్చిన హామీకి కట్టుబడి ప్రభుత్వంలో విలీనం
- దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగన్ సర్కారు చర్యలు
- కడప రీజియన్ పరిధిలోని 2434 కుటుంబాల్లో వెలుగు
- ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన సీఎం

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు పాదయాత్రలో ఆర్టీసీ ఉద్యోగుల విషయాన్ని ఆర్టీసీ యూనియన్ల నాయకులు, కార్మికులు తీసుకెళ్లారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ సంస్థను నిర్వీర్యం చేశారని, జీతాలు సక్రమంగా అందించడం లేదని, ఒకవేళ సమ్మె చేస్తే జీతాల్లో కోతలు విధిస్తున్నారని, అలాగే సమస్యల కోసం ఆందోళనలు నిర్వహిస్తే మెమోలు ఇవ్వడం, పనిభారం ఎక్కువ చేయడం, ఆర్టీసీ సంస్థ ఈ విధంగా ఉందని వివరించారు. పరిస్థితిని విన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు మాట తప్పని ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయారు.

- ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే ఆర్టీసీ సంస్థను భారత దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని సాహసాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారు. కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారడంతోపాటు జీతభత్యాలను కూడా ప్రతి నెలా ప్రభుత్వ ఉద్యోగులతోపాటు అందిస్తున్నారు. ఒకవైపు ఆర్టీసీ సంస్థ నష్టాల్లో ఉన్నా ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా ఆర్టీసీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలను అందిస్తున్నారు.

ఉద్యోగ భద్రత

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న సాహసోపేత నిర్ణయంతో ఉద్యోగులు, కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నిండాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు రావడంతోపాటు వారికి ఉద్యోగ భద్రత కూడా కల్పించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఆర్టీసీ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ప్రభుత్వంలోకి విలీనం చేసి నాలుగేళ్లు పూర్తయింది. ఎన్నికలకు ముందు వచ్చిన హామీని ఆచరణలోకి పెట్టేందుకు ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మూడు నెలల్లో కమిటీ వేయడం, 2020 జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి తీసుకురావడంతో కార్మికులందరూ ప్రజా రవాణా శాఖ ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు. దశాబ్దాల తరబడి ఎవరూ చేయని సాహస వంతమైన నిర్ణయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలులోకి తీసుకొచ్చారు. దీంతో 2434 మంది కుటుంబాల్లో వెలుగులు నింపారు.

కడప రీజియన్ పరిధిలో ఆర్టీసీ ఉద్యోగుల వివరాలు

డిపో	ఉద్యోగులు
కడప	550
ప్రొద్దుటూరు	532
జమ్మలమడుగు	270
మైదుకూరు	250
బద్వేలు	262
పులివెందుల	320
కడప ఆర్ఎం కార్యాలయం	52
కడప జోనల్ వర్క్‌షాప్	198
మొత్తం	2434



బాబు హయాంలో సమ్మె చేస్తే జీతాలు కట్

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు చాలక అనేక ఇబ్బందులు పడేవారు. చంద్రబాబు హయాంలో సమ్మెలు, పోరాటాలు చేయడం తోపాటు తగిన ఫలితం దక్కలేదు. అయితే గత ప్రభుత్వం కార్మికులను వేధించి సమ్మె కాలానికి జీతాలను కట్ చేసి ఉక్కుపాదం మోపేవారు. ఉద్యోగ భద్రత కరువై కార్మికులు రోజులు లెక్కబెట్టుకునేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించిందని పలువురు ఉద్యోగులు తెలిపారు.

- కరోనా సమయంలో లాక్‌డౌన్ కారణంగా జిల్లాలోని ఆరు డిపోలలో బస్సులన్నీ రోడ్డుపైకి రాక డిపోలకే పరిమితం అయ్యాయి. ఆ పరిస్థితుల్లో గత ప్రభుత్వమైతే కార్మికుల వేతనాల్లో కోతలు పడేవి. అయితే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఎన్ని కష్టాలు ఉన్నా ఒకటో తేదీన టంచన్‌గా జీతాలు చెల్లించారు. ఇలా జీతాలు చెల్లించడం దేశ చరిత్రలో మొదటిసారి అని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

బలిజలకు రాజకీయంగా
అత్యంత ప్రాధాన్యం



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబును సత్కరిస్తున్న బలిజ నేతలు

- బలిజ భవన్ నిర్మాణానికి కృషి
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్: బలిజ సామాజికవర్గ నాయకులకు రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తామని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ ఆడిటోరియంలో కడప, కమలాపురం నియోజకవర్గాలకు సంబంధించి బలిజల ఆత్మీయ సమ్మేళనానికి ఎంపీతోపాటు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కె.సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందుల ప్రాంతంలో విశేష సేవలందించిన పాలెం దొరస్వామి నాయుడుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనమైన గుర్తింపునిచ్చారని, ఆయన పేరు మీద రూ.10 కోట్లతో మోడల్ స్కూల్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రపంచంలోనే పేరెన్నికగన్న శ్రీకృష్ణదేవరాయల పాలనా కాలంలో దేవాలయాలు నిర్మించి, చెరువులు ఎక్కువగా తవ్వించారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తుల ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని తెలిపారు. బలిజల కోరిక మేరకు రాబోవు రోజుల్లో బలిజ భవన్‌కు స్థలం కేటాయించి, ఎంపీ నిధులతోనే బలిజ భవన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బలిజలకు వైఎస్సార్‌సీపీ ఇచ్చిన 31 అసెంబ్లీ స్థానాలు టీడీపీ, జనసేన కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కె.సురేష్‌బాబు మాట్లాడుతూ 2004కు ముందు బలిజ సామాజిక వర్గమంతా టీడీపీకి మద్దతుగా ఉండేదని, దివంగత వైఎస్సార్ సీఎం అయ్యాక ఆ సామాజిక వర్గ నేతలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక కాపులకు ఒక డిప్యూటీ సీఎంతోపాటు 4 మంత్రి పదవులు ఇచ్చారని తెలిపారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ గత ఎన్నికల్లో బలిజ సామాజిక వర్గానికి చెందిన దుర్గా ప్రసాద్‌కు టికెట్ ఇచ్చిన టీడీపీ, ఆయన ఓటమి పాలవగానే కడప ఇన్‌చార్జి పదవి ఇవ్వకుండా మోసం చేశారని గుర్తు చేశారు. రాయలసీమ పరిధిలోని బలిజలకు ప్రత్యేక కార్పొరేషన్ కోసం కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వంద శాతం సామాజిక న్యాయం అమలు జరిగిందన్నారు. అనంతరం కుడా చైర్మన్ గురుమోహన్, సీనియర్ నాయకులు తుమ్మలకుంట శివశంకర్, బాస్ అధ్యక్షుడు దాసరి శివప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ హరీంద్రనాథ్, గండి ఆలయ చైర్మన్ క్రిష్ణతేజ, కో ఆప్షన్ సభ్యురాలు పత్తిరాజేశ్వరి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథ్, తోటక్రిష్ణ, మల్లికార్జున కిరణ్, రెడ్డి ప్రసాద్, శంకరాపురం సింధు, శ్రీరాములు, సుదర్శన్ రాయల్, శివకేశవ, నాగమల్లిక, రామక్రిష్ణ, బలిజ నాయకులు నారాయణస్వామి రాయల్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బలిజ సంఘీయులు

కడపలో హీరోయిన్ శ్రీలీల సందడి

సరికొత్తగా తీర్చిదిద్దిన కళ్యాణ్ షోరూంను ప్రారంభించిన హీరోయిన్

కడప కార్పొరేషన్: కడప నగరంలో ప్రముఖ సినీనటి శ్రీలీల సందడి చేసింది. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా సరికొత్తగా తీర్చిదిద్దిన కళ్యాణ్ షోరూంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వసనీయత, నిజాయితీ, కస్టమర్ల పట్ల నిబద్ధత కలిగిన కల్యాణ్ జ్యువెలర్స్ బ్రాండ్‌కు ప్రాతినిధ్యం వహించగలగడం తనకు ఎంతో గర్వకారణమన్నారు. ఇక్కడి ఆభరణాల ప్రేమికులను కల్యాణ్ జ్యువెలర్స్ ఆకట్టుకోగలదని తెలిపారు. కల్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ రమేష్ కల్యాణరామన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్తగా తీర్చిదిద్దిన కల్యాణ్ జ్యువెలర్స్ షోరూమ్‌ను ప్రారంభించడం ద్వారా కస్టమర్ల అవసరాలకు తగ్గట్లుగా ఆభరణాలను అందించే సమగ్ర వ్యవస్థను అందుబాటులోకి తేవడం, వారికి అత్యుత్తమ షాపింగ్ అనుభూతిని కలిగించడమే తమ లక్ష్యమన్నారు. విశ్వసనీయత, పారదర్శకత అనే మూలసూత్రాలకు కట్టుబడి ఉంటూనే కస్టమర్లకు ప్రపంచ స్థాయి అనుభూతిని అందించేందుకు ఎప్పటికప్పుడు తమను తాము సరికొత్తగా తీర్చిదిద్దుకుంటూనే ఉంటామన్నారు. కల్యాణ్ జ్యువెలర్స్ హౌస్ బ్రాండ్స్‌లో ముహూరత్ (వెడ్డింగ్ జ్యువెలరీ కలెక్షన్), ముద్ర (హ్యాండ్‌క్రాఫ్టెట్ యాంటిక్ జ్యువెలరీ), నిమహ్ (టెంపుల్ జ్యువెలరీ) అనోఖీ (అన్‌కట్ డైమండ్స్) లభిస్తాయని తెలిపారు.



కళ్యాణ్ జ్యువెలర్స్ షోరూం ప్రారంభిస్తున్న సినీనటి శ్రీలీల

లక్ష్యం.. శతశాతం

- ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలు
- చువాన్ పాఠశాల నిర్వహణ
- బూత్ లెవల్ అవేర్‌నెస్ గ్రూపులు

SVEEP

100%



గ్రామీణ ప్రాంత రైతులకు స్వీప్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్న అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచడం కోసం సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. గత ఎన్నికల్లో రాష్ట్ర సగటు కంటే ఓటింగ్ శాతం తక్కువ నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిలో వంద శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ నోడల్ అధికారిని నియమించారు. చువాన్ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు సాయంత్ర సమయంలో సంబంధిత గ్రామాల్లో చిన్నచిన్న సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీఎల్ఓతో స్థానిక ఉపాధ్యాయుడు లేదా వయోజన విద్య ప్రేరక్ సహకారంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

ఎలక్టోరల్ లిటరసీ క్లబ్బులు

జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో భావి ఓటర్లయిన 14–17 ఏళ్ల విద్యార్థులతో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్బులు ఏర్పాటు చేస్తున్నారు. 18 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు గల విద్యార్థుల కోసం అన్ని డిగ్రీ, ప్రొఫెషనల్ కళాశాలల్లో వేర్వేరుగా క్యాంపస్ అంబాసిడర్లుగా విద్యార్థుల్లోనే కొందరిని ఎంపిక చేశారు. అవగాహన, చురుకుదనం, ప్రసంగ నైపుణ్యం కలిగిన విద్యార్థులను అంబాసిడర్లుగా నియమిస్తున్నారు. గత ఎన్నికల్లో ఓటింగ్ తక్కువ నమోదైన పోలింగ్ కేంద్రాల్లో వీరు పర్యటించి ఈవీఎంలు, వీవీ ప్యాట్ల ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని రిటర్నింగ్ అధికారి పోలింగ్ కేంద్ర స్థాయిలో స్వీప్ కార్యకలాపాల నిర్వహణకు బూత్ లెవెల్ అవేర్‌నెస్ గ్రూపులు ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, యానిమేటర్లు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ సచివాలయ సంక్షేమ కార్యదర్శి, విలేజ్ పోలీసు మద్దతుతో బీఎల్ఓలు కన్వీనర్లుగా ఈ అవేర్‌నెస్ గ్రూపులు ఏర్పాటయ్యాయి. రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో మండల స్థాయి మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగానికి సమాచారం ఇవ్వడం, బూత్ లెవెల్‌లో ఓటర్ల నమోదు, ప్రజల్లో అవగాహన కోసం వీధి నాటకాలు, ఆటలు, క్విజ్‌లు తదితర పోటీలు ఏర్పాటు చేస్తున్నారు.

ఓటర్లలో చైతన్యమే ధ్యేయం

పోలింగ్‌కు వారం రోజుల ముందు ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించనున్నారు. ఎన్నికల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోషల్ మీడియాను ఉపయోగించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సి-విజిల్, ఓటరు హెల్ప్‌లైన్ యాప్, సాక్ష్యం యాప్, నో యువర్ క్యాండియేడ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడంపై ఓటర్లలో ఈ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. లోకల్‌మీడియాలో ప్రకటనలు, మానవహారాలు, సినిమా థియేటర్లలో ప్రకటనల ద్వారా చైతన్యం కల్పిస్తున్నారు. ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులు, వృద్ధులు, మహిళలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించనున్నారు.

కొలువుకు బోగస్ వైరస్!

'తూచ్.. నా సర్టిఫికెట్స్ బోగస్‌వి.. ఆ సర్టిఫికెట్స్‌తోనే ఉద్యోగం పొందాను' అని ఒక ఉద్యోగి వినమ్రంగా ఒప్పుకున్నారు. బండారం మొత్తం బయట పడుతుందనో లేక మిగతా అవినీతి అంశాలు ఏవైనా ఉంటే వాటిని భూ స్థాపితం చేయాలనో తెలియదు. ఉద్యోగంలో చేరి మూడు నెలల పాటు వేతనం పొందాక తప్పును ఒప్పుకోవడం గమనార్హం. మరొక అభ్యర్థి అయితే ఏకంగా ముందు ఎంబీఏ చేసిన తరువాత బీఎస్సీ కంప్యూటర్స్ చేయడం ఎలా సాధ్యమో ఆ దేవుడికి.. అడ్డదారుల్లో ఉద్యోగాలు పొందిన వారికి, అందుకు సహకరించిన సహచరులకే ఎరుక. ఈ అంశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో చర్చనీయాంశంగా మారింది.



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

- నకిలీ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగాలు
- పరిశీలనలో కూడా పట్టుబడని వైనం
- 'జిల్లా వైద్య ఆరోగ్య శాఖ'లో చర్చనీయాంశం

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో 2023 డిసెంబర్ నెలలో జిల్లా క్షయ నియంత్రణ విభాగానికి సంబంధించి వివిధ కేడర్‌లకు చెందిన 13 పోస్టుల భర్తీ, నియామక ప్రక్రియ జరిగింది. ఈ నియామకాల్లో అవకతవకలు వెలుగు చూశాయి.

అడ్డదారుల్లో ఉద్యోగం

ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టుకు సంబంధించి ఒక అభ్యర్థి బీఎస్సీ ఎంఎల్‌టీ కోర్సును పూర్తి చేసినట్లుగా దరఖాస్తు చేశారు. మెరిట్ ఇతర నిబంధనల ఆధారంగా ఆ వ్యక్తి ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఇదాంతా గడిచిన డిసెంబర్ నెలలో జరిగింది. ఇప్పటికి అతను మూడు నెలల జీతం కూడా పొందారు. ఈ నేపథ్యంలో ఈ పోస్టుకే దరఖాస్తు చేసుకున్న ఒక అభ్యర్థి ఉద్యోగం పొందిన వ్యక్తి సర్టిఫికెట్స్ నకిలీవని.. పరిశీలించి, దర్యాప్తు చేయాలని ఫిర్యాదు చేశారు. తరువాత ఉద్యోగం పొందిన వ్యక్తి అధికారుల వద్దకు వచ్చి 'అవును సార్.. నావి దొంగ సర్టిఫికెట్స్.. నన్ను ఉద్యోగం నుంచి తీసేయండని' సెలవిచ్చారు. దీంతో అధికారులు ఆ ఉద్యోగిని తొలగిస్తున్నట్లుగా 'టెర్మినేషన్ ఆర్డర్'ను జారీ చేశారు. ఇంత వరకు బాగానే ఉంది. అసలు తొలగించపడిన వ్యక్తికి నకిలీ సర్టిఫికెట్స్ ఎక్కడి నుంచి వచ్చాయి. ఆ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగం పొందడానికి ఎవరైనా సహకరించారా? సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌లో నకిలీవని గుర్తించలేకపోయారా? అనే సందేహాలు సహజంగానే అందరికీ కలుగుతున్నాయి. దీని వెనుక సూత్రదారులు ఎవరు? అన్నీ తెలిసిన వారే ఇదంతా చేస్తున్నారా లేక నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించి వారి ఆశలను సొమ్ము చేసుకుంటున్నారా అనే సందేహాలు కలుగుతున్నాయి.

మరొక వ్యక్తి నిర్వాకం


జిల్లా క్షయ నియంత్రణ విభాగానికి సంబంధించే ఒక కేడర్ పోస్టుకు మరొక వ్యక్తి ఉద్యోగానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్నారు. ఆ వ్యక్తి సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా అయితే ఆ వ్యక్తి నిబంధనల ప్రకారమే ఉద్యోగం పొందారు. ఈయన కూడా డిసెంబర్ నుంచి ఉద్యోగంలో కొనసాగుతున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. ఆ వ్యక్తి ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగానికి దరఖాస్తు సమర్పించినప్పుడు అందులో 2017వ సంవత్సరంలో బీఎస్సీ కంప్యూటర్స్ కోర్సు చేసినట్లుగా విద్యా అర్హత కాలంలో పొందుపరిచారు. సదరు ఇదే వ్యక్తి 2020లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని ఒక పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 2011వ సంవత్సరంలో ఎంబీఏ కోర్సును చేసినట్లుగా పేర్కొన్నారు. అయితే అప్పుడు ఉద్యోగం రాలేదు. కాగా 2017లో బీఎస్సీ కంప్యూటర్స్ చేసిన వ్యక్తి 2011లో ఎంబీఏ కోర్సును ఎలా పూర్తి చేశారనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న ఫైనల్ మెరిట్ లిస్ట్‌లో ఉన్నాయి. ఇందులో మతలబు ఏమిటనేది దర్యాప్తు చేస్తే గానీ అసలు విషయం తేలదు. అలాగే ఇలా 'బోగస్ ఉద్యోగులు' ఎంత మంది ఉన్నారనే అంశాలపైనా దృష్టి సారించాల్సి వుంది.

మధ్యప్రదేశ్ కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్స్?

ఇందుకు సంబంధించి మరొక అంశం చర్చకు వస్తోంది. ఇటీవల కాలంలో బోగస్ సర్టిఫికెట్స్‌ను మధ్యప్రదేశ్ కేంద్రంగా ఒక యూనివర్సిటీ పేరుతో నకిలీ సర్టిఫికెట్స్‌ను తయారు చేస్తున్నట్లుగా అనుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ అంశాలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం అర్హులైన నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన కోసం కృషి చేస్తోంది. అయితే కొంతమంది అవినీతిపరుల వల్ల అర్హులకు అన్యాయం జరుగుతోంది. అలాంటి వారికి అధికారులు అడ్డుకట్ట వేసి అర్హులకు న్యాయం చేయాలని నిరుద్యోగులు, ఉద్యోగులు కోరుతున్నారు.

FAKE

పోలీసు విచారణకు ఆదేశిస్తాం



ఒక ఉద్యోగి బోగస్ సర్టిఫికెట్స్ సమర్పించామని ఒప్పుకోవడంతో ఆ వ్యక్తిని ఉద్యోగం నుంచి తొలగించాం. డిపార్ట్‌మెంట్‌కు చెందిన (వేతనం) డబ్బును స్వాధీనం చేసుకున్నాం. మిగతా అంశాలకు సంబంధించి పోలీసు విచారణకు చర్యలు తీసుకుంటాం. అలాగే మరొక ఉద్యోగి విద్యా కోర్సు అంశాలకు సంబంధించి సర్టిఫికెట్స్ పరిశీలనకు సంబంధిత యూనివర్సిటీలకు పంపిస్తాం. నివేదికల ఆధారంగా చర్యలు చేపడుతాం. నిరుద్యోగులు ప్రలోభావాలకు లోను కావద్దు. ఏవైనా ఉంటే తనకు ఫిర్యాదు చేయాలి. – డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

క్లుప్తంగా

బంగారు ఆభరణాలు పట్టివేత

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో కోయంబత్తూరుకు చెందిన రాజారామ్ అనే వ్యక్తి నుంచి 400 గ్రాముల బంగారు ఆభరణాలను టూ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీఐ అబ్దుల్‌కరీం తనిఖీలు నిర్వహిస్తుండగా రాజారామ్ వద్ద బంగారు నగలు ఉన్నట్లు గుర్తించారు. నగలకు సంబంధించి అతను బిల్లులు చూపించకపోవడంతో ఆభరణాలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఇసుక టిప్పర్, జేసీబీ సీజ్

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె పాపాఘ్నినది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ముందుస్తు సమాచారం రావడంతో శుక్రవారం తెల్లవారుజామున కడప రూరల్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, జేసీబీ వాహనాన్ని సీజ్ చేశారు.

రిమ్స్ మార్చురీలో వృద్ధుడి మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో మార్చి 31న అన్నమయ్య జిల్లా రాయచోటి టౌన్ జెండామాను వీధి అడ్రసుతో వై. ఆదినారాయణ రెడ్డి (60) అనే వ్యక్తి అనారోగ్యంతో చేరాడు. ఈనెల 4వ తేదీన రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో వుంచారు. అతని బంధువులు ఎవరైనా వుంటే తమను సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్‌ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

చెన్నూరు : మండలంలోని శాటిలైట్ సిటీలో జింక లక్షుమ్మ (45) అనే మహిళ అనుమానాస్పదస్థితిలో మరణించినట్లు పోలీసులు తెలిపారు. సీఐ పార్థసారథి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతి చెందిన మహిళ భర్త మురళీ గంగాధర్ అని ఆయన తెలిపారు. కాగా ఆ మహిళ శరీరమంతా ఉబ్బి నీరు కారుతోందని.. మూడురోజుల కిందట మరణించినట్లుగా సంఘటనా స్థలాన్ని బట్టి చూస్తే తెలుస్తోందన్నారు. లక్షుమ్మ 15 సంవత్సరాల క్రితం భర్త నుండి విడిపోయి ఒంటరిగా జీవిస్తోందన్నారు. ఆమెది ఒంటిమిట్ట మండలం, మాధవరం స్వగ్రామమని, రెండు సంవత్సరాల నుంచి శాటిలైట్ సిటీలోని 12వ బ్లాక్‌లో మూడవ అంతస్తులో నివాసం ఉంటోందని తెలిపారు. ఆమె మృతిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వెయ్యి నెలల పుణ్య ఫలం బడీరాత్

- నేడు రంజాన్ లైలతుల్ ఖదర్
- రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు చేయనున్న ముస్లింలు
- వెయ్యి నెలలు ఆధ్యాత్మికంగా గడిపిన పుణ్యం లభ్యమవుతుందంటున్న మౌల్వీలు





ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మదనపల్లె సిటీ/రాజంపేట టౌన్/కడప కల్చరల్ : లైలతుల్ ఖదర్...వెయ్యి నెలలకు పైగా అల్లాహ్ స్మరణం, దువా, ప్రత్యేక ప్రార్థనలు చేసిన పుణ్య ఫలం లభించే రేయి. దీనిని ముస్లింలు 'బడీరాత్' (పెద్ద రాత్రి) అని కూడా అంటారు. పవిత్ర రంజాన్ మాసంలో లైలతుల్ ఖదర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. రాత్రి ఇషా నమాజ్ నుంచి తెల్లవారు జామున సహెరి వేళ వరకు ముస్లింలు ఆధ్యాత్మికంగా గడుపుతారు. పగలంతా రోజా ఉంటారు. రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. తరావీహ్ నమాజ్, బయాన్, హదీస్, ఖురాన్ తిలావత్, సలాతుల్ తజ్బీ, తహజ్జుద్ నమాజ్, దువా ఇలా రేయంతా అల్లాహ్ ఆరాధనలో గడుపుతారు. తమ కష్టనష్టాలు విన్నించుకుంటారు. వాటిని దూరం చేయాలని వేడుకుంటారు. పాపాలను దహించాలని మొరపెట్టుకుంటారు. తోబా, అస్తగ్ ఫిరుల్లా చదివి తప్పుల నుంచి క్షమాపణ కోరి, నరకం, నరకాగ్ని నుంచి ముక్తి కోరుతారు. ఒక తల్లి ప్రేమ కంటే 70 రెట్లు అధికంగా ప్రేమ చూపే అల్లాహ్..పిల్లల తప్పులను తల్లి క్షమించినట్లు అనంత కరుణామయుడు కూడా మనుషుల మొర విని కరిగిపోతారు. చేసిన పాపాలు, తప్పులను క్షమించి, ముక్తి కలిగిస్తారు. శనివారం జాగరణ చేస్తే ఒకటి రెండు కాదు ఏకంగా వెయ్యి నెలలకు పైగా ఆధ్యాత్మికంగా గడిపిన పుణ్య ఫలాన్ని అందిస్తారు. అదే లైలతుల్ ఖదర్ విశిష్టత అని మౌల్వీలు అంటున్నారు.

వెయ్యి నెలల పుణ్యం ఎందుకంటే?

మహమ్మద్ ప్రవక్త (నబీ) సొల్లెల్లాహు అలైహివసొల్లం కంటే పూర్వం ఉన్న ప్రవక్తల కాలంలో మనుషుల ఆయుష్షు వందల ఏళ్లు ఉండేదని హదీసుల ద్వారా తెలుస్తోంది. నాటి ముస్లింలు వందల ఏళ్లు ఆధ్యాత్మికంగా గడిపి స్వర్గానికి మార్గం ఏర్పాటు చేసుకునేవారు. అయితే ఆయుష్షు రానురాను మరింత తగ్గుతుందని, నాటి ప్రవక్తల కాలంలో ఉమ్మత్ సంపాదించుకున్న పుణ్యంతో పోల్చితే తన ఉమ్మత్ (ప్రవక్త సూచించిన మార్గాలను అనుసరించే మనుషులు) పుణ్యం తక్కువగా ఉంటుందని భావించారు మహమ్మద్ ప్రవక్త. ఈ విషయంపై అల్లాహ్‌ను వేడుకుంటూ... ఆయుష్షు తక్కువగా ఉన్న తన ఉమ్మత్‌కు అధికంగా పుణ్యం లభించే మార్గాలు చూపినా మహమ్మద్ ప్రవక్త సంతృప్తి చెందకపోవడంతో చివరకు లైలతుల్ ఖదర్‌ను తెస్తున్నట్లు అల్లాహ్ ప్రకటించారు. ఈ లైలతుల్ ఖదర్ రాత్రంతా జాగారణ చేసి, ఆధ్యాత్మికంగా గడిపిన వ్యక్తికి వెయ్యి నెలలకు పైగా స్మరించుకున్న పుణ్యం ఇవ్వనున్నట్లు చెబుతారు. దైవదూతలందరూ భూమిపైకి వచ్చి ఆధ్యాత్మికంగా గడిపే వారితో కరచాలనం చేసుకుని 'అల్లాహ్ మీ ప్రార్థనలు అంగీకరించారని' అభినందిస్తారని తెలుస్తోంది.

చివరి దశకంలోనే లైలతుల్ ఖదర్

రంజాన్‌లోని ఆఖరి అష్ర (చివరి పది రోజులు) లోనే లైలతుల్ ఖదర్ దాగి ఉందని మహమ్మద్ ప్రవక్త సొల్లెల్లాహు అలైహి వసొల్లం తన సహచర సహబాలకు సూచించినట్లు పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. మూడు భాగాలుగా ఈ నెలలోని చివరి 'జహన్నం సే ఫనా మాంగ్‌నేకా అష్ర'లో పెద్ద రాత్రి ఉంటుంది. అయితే ఏ రోజున అని స్పష్టత లేదు. అయితే నాలుగవ తాఖ్‌రాత్ అంటే శనివారం రాత్రి లైలతుల్ ఖదర్ పేరుతో అత్యధిక శాతం మంది జాగరణ చేస్తూ ఆధ్యాత్మికంగా గడపడం అనవాయితీగా వస్తోంది.

ప్రత్యేక ప్రార్థనలతో అధిక ఫలితం



పెద్దరాత్రి రోజున జాగరణ చేసి, ఆధ్యాత్మికంగా గడపాలి. నమాజ్, తరావీహ్, నఫిల్ నమాజ్, తహజ్జుద్ వంటి ప్రత్యేక ప్రార్థనలతో అధకంగా ఫలితం లభిస్తుంది. అల్లాహ్ స్మరణతో గడిపితే వెయ్యి నెలలు ఆరాధించిన పుణ్యం లభిస్తుందని పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. దైవదూతలంతా భూమిపైకి వచ్చి అల్లాహ్ కోసం ప్రార్థించే వారికి శుభాభినందనలు తెలుపుతారు.

– హాఫీజ్ ఇక్బాల్ అహమ్మద్, ప్రభుత్వ సర్‌ఖాజీ, మదనపల్లె

అల్లాహ్ అందించిన పెద్దకానుక



లైలతుల్ ఖదర్ రాత్రి అత్యంత పవిత్రమైనది. ఈరాత్రిని ముస్లింలకు అల్లాహ్ అందించిన పెద్దకానుక. ఈరాత్రే ఖురాన్ భూమిమీదకు అవతరించింది. ముస్లిలందరు బడీరాత్ రోజున ఆధ్యాత్మికంగా గడిపాలి.

– ఎస్.షామీర్‌బాషా, అధ్యక్షుడు, ఖుబా మసీదు, రాజంపేట

టీడీపీని వీడిన జిల్లా అధికార ప్రతినిధి



నేట్లపల్లె సోదరులను ఆహ్వానిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే

మైదుకూరు : మైదుకూరు మండలంలో టీడీపీకి గట్టి దెబ్బ తగిలింది. శుక్రవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, కడప నగర మేయర్ కె.సురేష్ బాబు, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి సమక్షంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లె శివరాం, ఆయన సోదరుడు టీడీపీ బీసీ విభాగం మండల నేత నేట్లపల్లె రామాంజనేయులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి వారిరువురికి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మైదుకూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నేట్లపల్లె సోదరులను కోరారు. నేట్లపల్లి శివరాం మాట్లాడుతూ 15 ఏళ్లుగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేశామన్నారు. అయితే పుట్టా సుధాకర్ యాదవ్ కులంతో రాజకీయం చేయాలని భావిస్తున్నారని.. బీసీల్లో ఉన్న నాయీబ్రాహ్మణ, కమ్మరి, రజక, ఉప్పర తదితర కులాలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాడని, నాయకులుగా వారిని ఎదగనివ్వడం లేదని ఆరోపించారు. మైదుకూరు నియోజకవర్గం టికెట్‌ను టీడీపీ ఒక అసమర్థుడు, అవినీతిపరునికి ఇవ్వడం వల్లే తాము టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు చెప్పారు. ఏళ్ల తరబడి పార్టీలో ఉన్న వారిని పుట్టా అణగదొక్కుతున్నాడని ధ్వజమెత్తారు. పుట్టా ఎక్కడో కాంట్రాక్టు పనులు చేసుకుంటున్న సమయంలో సర్పంచ్‌గా, ఎంపీపీగా ఉన్న మెత్రిమేకల గురవయ్య యాదవ్‌ను పార్టీలోకి వచ్చాక అణకదొక్కాడని ఆరోపించారు. ఖాజీపేటకు చెందిన మల్లె ఓబయ్య, పుట్టా రాజకీయ రంగ ప్రవేశానికి కారకుడైన మల్లికార్జున యాదవ్‌ను.. ఇంకా అనేకమందిని పుట్టా ఎదగనివ్వలేదని మండిపడ్డారు. పుట్టాను ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ గౌస్ లాజం, ఎంపీపీలు వీరనారాయణ రెడ్డి, లక్షుమయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

గోపవరం : గోపవరం మండల పరిధిలోని టీ.సండ్రపల్లె పంచాయతీ బుచ్చనపల్లె గ్రామానికి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. సింగిల్‌విండో అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బుచ్చనపల్లె గ్రామానికి చెందిన రామా పురం పెంచలయ్య, పోలిరెడ్డిగారి యల్లారెడ్డి, పునగాని పెద్దన్న, నాగమునితో పాటు మరో 15 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కట్టడాలకు పటిష్టమైనది భారతి సిమెంట్

– టెక్నికల్ ఇంజనీర్ శ్రీకాంత్‌రెడ్డి

సిద్దవటం : అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైన సిమెంట్ భారతి సిమెంట్ అని ఆ కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సిద్దవటం మండలంలోని చాముండేశ్వరీపేట గ్రామ సమీపంలో ఉన్న సెయింట్ ఆంథోని ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురువారం రాత్రి భారతి సిమెంట్ కంపెనీ వారి ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంజనీర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సిమెంట్ రోబెటెక్ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ గురించి వివరించారు. స్లాబ్‌కు మంచి అనుకూలమైన సిమెంట్ అని, పర్యావరణానికి కూడా అనుకూలంగా ఉంటుందని చెప్పారు. అనంతరం తాపీ మేస్త్రీలకు 1 లక్ష రూపాయల ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శ్రీనివాసులు, సిమెంట్ డీలర్ మదర్ థెరిస్సా ఎంటర్ ప్రైజెస్ వెంకటరామిరెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే షర్మిల చౌకబారు ఆరోపణలు

– ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మాట్లాడుతున్న డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం బద్వేలు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రచారంలో షర్మిల చేసిన ఆరోపణలను ఎమ్మెల్సీ ఖండించారు. పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇద్దరు అక్కాచెల్లెల్లు పని గట్టుకొని ఇక్కడకు వచ్చి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించడం, జగనన్నను ఓడించాలని చెప్పడం గమనిస్తే చంద్రబాబు కోసం ఆమె పని చేస్తోందని అర్థమవుతోందన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చాలా సాత్వికుడని, ఆయన్ను చూసిన ప్రతిఒక్కరూ ఆయన ఎంతో మంచి వ్యక్తి అని గౌరవిస్తున్నారన్నారు. అటువంటి సౌమ్యుడిని హంతకుడని ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. సీబీఐ విచారణ, కోర్టు విచారణ జరుగుతోందని, న్యాయస్థానంలో తీర్పు ఇంకా రాలేదన్నారు. అయితే షర్మిల, సునీతలు ఆయనపై నింద వేయడం సహేతుకంగా లేదన్నారు. తెలంగాణాలో పార్టీ పెట్టి, దాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేసిన షర్మిల ఓపిక పట్టకుండా ఆంధ్రలో ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం వల్ల వారికే నష్టమన్నారు. వారికి డిపాజిట్లు కూడా రావన్నారు. చంద్రబాబు గతంలో వచ్చిన 23 సీట్లు అయినా తెచ్చుకుంటారా అని ప్రశ్నించారు. బద్వేలులో మీకు మూడు వేలు ఓట్లు కూడా రావన్నారు. ఇక్కడ వైఎస్సార్‌సీపీ 80 వేల ఓట్లు మెజారిటీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. షర్మిల చౌకబారు విమర్శల వల్ల వైఎస్సార్‌సీపీకి ఎలాంటి నష్టం జరగదన్నారు. తెలంగాణాలో ఫెయిల్యూర్ అయిన షర్మిల ఇక్కడా ఫెయిల్యూర్ కాక తప్పదన్నారు. ప్రత్యేక హోదా ఎవరు ఇవ్వాలి? రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసిన కాంగ్రెస్ ఆనాడే ఎందుకు ప్రత్యేక హోదా ఇవ్వలేదు? పోలవరం, కడప ఉక్కు పరిశ్రమలు ఎందుకు చట్టంలో పెట్టలేదు? ఇవన్నీ తెలియని అజ్ఞానంతో, పరిపక్వత లేకుండా షర్మిల మాట్లాడటం విడ్డూరం, ఆశ్చర్యకరంగా ఉందన్నారు. వైఎస్ వివేకా అంటే మేమందరం ఎంతో అభిమానిస్తామని.. ఆయన హత్యతో అందరం బాధపడుతున్నామన్నారు. కేవలం రాజకీయలబ్ధి కోసం బురదచల్లే వ్యవహారం చేస్తున్న షర్మిల ఆ పద్ధతిని మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, యువనేత ఆదిత్యారెడ్డి, వైస్ ఎంపీపీ సియం బాష, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, నాయకులు నరసింహులు, రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.


స్థాయికి తగ్గట్లు షర్మిల మాట్లాడాలి



మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి

పోరుమామిళ్ల : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల స్థాయి మరచి మాట్లాడటం సరికాదని వైఎస్సార్‌సీపీ బద్వేలు నియోజకవర్గ అదనపు సమన్వయకర్త యస్. విశ్వనాథరెడ్డి హితవుపలికారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కారణమని షర్మిల ఆరోపించడం సరికాదన్నారు. రాజన్న బిడ్డగా ఆమెపై గౌరవముందని, నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వైఎస్ అవినాష్‌రెడ్డి ఎలాంటి వారో జిల్లా ప్రజలందరికీ తెలుసన్నారు. కడిగిన ముత్యాంలా ఆయన తన నిజాయితీని నిరూపించుకుంటారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని విభజించి, ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. జగనన్నను విమర్శించేందుకు చంద్రబాబుకు కోవర్టుగా షర్మిల పనిచేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాశినాయన, బి. కోడూరు మండలాల జెడ్పీటీసీలు డి. సత్యనారాయణరెడ్డి, దావీదు, గంగనపల్లె, కోడిగుడ్లపాడు సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, బాలగురయ్య, పోరుమామిళ్ల మండల నాయకులు బాలగురివిరెడ్డి, పీరయ్య, రామకృష్ణారెడ్డి, కలసపాడు మండల నాయకులు ప్రభంజన్ కుమార్, దేశాయి చెన్నకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వావిళ్ల గురయ్య, బాల అంకిరెడ్డి, బి. కోడూరు మండల నాయకులు దుగ్గిరెడ్డి, కాశినాయన మండల నాయకులు తిరుపతయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై మండిపడ్డ ఆర్యవైశ్యులు



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రవికుమార్, తదితరులు

పులివెందుల రూరల్ : వర్తకులు, వ్యాపార కార్యక్రమాల మాటున అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారంటూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మాట్లాడటం సరికాదని ఆయన వ్యాఖ్యలపై పులివెందుల ఆర్యవైశ్యులు మండిపడ్డారు. శుక్రవారం పులివెందులలో విలేకరుల సమావేశంలో జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కరుణాకర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రవికుమార్, పులివెందుల వర్తక యూనియన్ అధ్యక్షుడు పుల్లగూర సుధాకర్‌లు మాట్లాడుతూ చంద్రబాబు రావులపాలెంలో నిర్వహించిన బహిరంగ సభలో వర్తకులు నిత్యావసర సరుకుల మాటున గుట్కా, గంజాయి ఇతర నిషేధిత ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని వ్యాపారస్తులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలన్నారు. ఎన్నికల్లో వర్తక, వాణిజ్య వ్యాపారులు చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి దేవస్థాన సభ్యుడు సాగర్, గంగాధర్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



చలమారెడ్డిపల్లెలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



44వ డివిజన్‌లో పార్టీలో చేరిన వారితో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



పార్టీలో చేరిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



చాంద్‌బాషాకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని చలమారెడ్డిపల్లెలో తెలుగుదేశం పార్టీ నుంచి 100 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం వారికి ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాష, కడప నగర మేయర్ కే.సురేష్ బాబు, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డిలు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన చల్లా పవన్, నంద్యాల సాయి, వెంకటరామిరెడ్డి, నరసింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విజయ్ కుమార్, చంద్రమ్మ, వెంకటమ్మ, రాజేశ్వరి, అంజనమ్మ, శిరీష, వెంకటసుబ్బయ్య, లక్ష్మయ్య, తేజ , కాశీ, వెంకటేష్, రాము, సుధాకర్, శ్రీనివాసులు, వంశీ, శివ రామక్రిష్ణలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుబ్బారెడ్డి, బాలకొండయ్య, నగర అధ్యక్షుడు ఎన్. సుబ్బారెడ్డి, బంగారు నాగయ్య, రామ్మోహన్‌రెడ్డి, మాస్టర్ అహ్మద్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

44వ డివిజన్‌లో....

కడప నగరంలోని 44వ డివిజన్ పరిధిలో టీడీపీ నుండి 50 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహమ్మద్ స్కూల్ డైరెక్టర్ అబ్దుల్ కబీర్, మహమ్మద్ అబ్దుల్ అజీజ్ అక్రమ్ వారి మిత్రబృందం పార్టీలో చేరారు. ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాష, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప మేయర్ కే.సురేష్ బాబు , ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలు పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎస్. సుబ్బారెడ్డి సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, షఫీ, జేజేరెడ్డి, ఎల్లారెడ్డి , షేక్ జమీల్, ఫయాజ్, షఫీ,రమేష్ రెడ్డి, మాస్టర్ అహ్మద్, మున్నా , అఖిల్, చాంద్ బాషా, నాగమల్లారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాలు

పోరుమామిళ్ల : అక్కలరెడ్డిపల్లెలో శుక్రవారం నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సమక్షంలో 50 కుటుంబాలు టీడీపీ నుండి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారందరికీ పార్టీ కండువాలు కప్పి గోవిందరెడ్డి వారిని పార్టీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఆర్‌డీ సలహాదారు నాగార్జునరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి గురయ్య, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, ఏజేసీ కన్వీనర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో 100 కుటుంబాలు చేరిక

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక 17వ వార్డులోని నడింపల్లెలో శుక్రవారం రాత్రి నడింపల్లె చాంద్ బాషా, ఆయన సతీమణి, మాజీ కోఆప్షన్ మెంబర్ గౌసియాతోపాటు 100 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి కండువాలు వేసి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, వార్డు కౌన్సిలర్ చింతకుంట సరితారెడ్డి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. అనంతరం చాంద్ బాషా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్లు ఖాజా, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఫరీద్ బాషా, నన్నేసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం



మృతి చెందిన సుజాత

వారిద్దరూ దంపతులు.. అన్యోన్యంగా జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కష్టపడి వ్యవసాయం చేస్తున్నారు. ఒక కుమారుడికి వివాహం చేశారు. ఇంకో కొడుకు, కూతురిని చదివిస్తున్నారు. బిడ్డలను ఉన్నతంగా చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని ఆ భార్యాభర్తలు కన్న కలలను రోడ్డు ప్రమాదం చిదిమేసింది. ఇద్దరినీ కబళించింది. తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో వారి పిల్లల రోదనను చూసిన స్థానికులు కన్నీటిపర్యంతం అయ్యారు.



మృతి చెందిన పుల్లయ్య

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

దువ్వూరు : దువ్వూరులోని కడప-కర్నూలు జాతీయ రహదారిపై పుల్లారెడ్డి పేట పెట్రోలు బంకు వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. మండలంలోని భీమునిపాడు గ్రామానికి చెందిన పందిటి పుల్లయ్య (56), అతని భార్య పందిటి సుజాత (54) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుల్లయ్య, సుజాత దంపతులు మండలంలోని వెంకుపల్లె గ్రామంలోని బంధువుల సీమంతం ఫంక్షన్‌కు వచ్చి తిరిగి వారి గ్రామానికి స్కూటర్‌పై వెళుతుండగా.. పుల్లారెడ్డి పేట పెట్రోలు బంకు జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం వారి స్కూటర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో గాయపడిన వారిని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో పుల్లయ్య మృతి చెందాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున సుజాత కూడా మృతి చెందింది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పుల్లయ్య వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఒక కుమారుడికి వివాహం చేశాడు. ఇంకో కొడుకు, కూతురిని చదివిస్తున్నాడు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని ఆ దంపతులు పెంచుకున్న ఆశలు అడియాశలయ్యాయి. రోడ్డు ప్రమాదంలో అమ్మానాన్న ఇద్దరూ చనిపోవడంతో వారి పిల్లలు గుండెలవిసేలా రోదిస్తుంటే వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.